సాక్షి సంగారెడ్డి

బుధవారం। 8। మే। 2024



మోదీయే మరోసారి ప్రధాని

మరోసారి మోదీయే ప్రధాని అవుతారని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. వివరాలు IIలో ▸



జోడెద్దుల్లా పనిచేస్తాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి తాను జోడెద్దుల్లా పని చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. వివరాలు IIలో ▸



బస్సులు రావు..

జహీరాబాద్ నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదు. వివరాలు IIIలో ▸

మెదక్ నా ఊపిరి

ప్రాణం ఉన్నంత వరకు మరువను

- రూ.కోట్లాది నిధులతో సస్యశ్యామలం చేశా
- మెడికల్ కళాశాల సైతం మంజూరు
- కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జిల్లాలను తొలగిస్తుందట
- కొత్త జిల్లా ఉండాలంటే వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి
- కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



ప్రజలకు కేసీఆర్ అభివాదం

మెదక్‌జోన్: 'మెదక్‌ను నా ప్రాణం ఉన్నంత వరకు మరువను. నాడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది. రూ.వందల కోట్ల నిధులతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశా. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జిల్లాలను తీసివేస్తానంటోంది. మెదక్ జిల్లా ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాల్సిన అవసరం మీపైన ఉంది' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మెదక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని 16 నిమిషాలపాటు ప్రసంగించారు. కేసీఆర్ మాట్లాడుతూ కాళేశ్వరం నీటితో హల్దీవాగును నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. మెదక్ మెడికల్ కళాశాలను మంజూరు చేశామని, ఏడుపాయలకు వందకోట్లతోపాటు మెదక్ నియోజకవర్గానికి కోట్లాది నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసిందని కేసీఆర్ మండిపడ్డారు. మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధి రూ.50కోట్లు, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.25కోట్ల చొప్పున అలాగే ప్రతీ గ్రామానికి రూ.15లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. అకాలవర్షాలతో ధాన్యం తడిసిపోతున్నా పట్టించుకునేవారేలేరన్నారు.



ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మోదీలాగే రఘునందన్ గ్యాస్..

ప్రధానమంత్రి మోదీలాగే రఘునందర్‌రావు సైతం ఉత్త గ్యాస్ కొడుతాడని, దుబ్బాకలో చెల్లని వ్యక్తిని మెదక్‌లో కూడా చిత్తుగా ఓడించాలన్నారు. అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేయొద్దన్నారు. విద్యావంతుడు, మాజీ ఐఏఎస్ అధికారి ఈ ప్రాంతానికి సుపరిచితుడైన వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. తన సొంత నిధులైన రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ నిర్మిస్తానని హామీఇచ్చిన వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ సర్కార్..

అంతకుముందు మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి హామీలను అమలయ్యే విధంగా చూస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుంచి కరెంటు సమస్య ఏర్పడి మోటార్లు కాలిపోతున్నాయన్నారు. బీజేపీకి ఓట్లు వేస్తే నీళ్ల లేని బావిలో వేసినట్లేనన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ఇంటింటికి క్యాలెండర్‌ను పంచి బీజేపీ ఓట్లు అడుగడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఫారూక్‌హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల ఖర్చు నమోదు చేయాలి



మానిటరింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను మంగళవారం మెదక్ లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్వాన్షి, జహీరాబాద్ వ్యయ పరిశీలకులు మోతీలాల్, కలెక్టర్ క్రాంతి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రచార ప్రకటనలకు సంబంధించిన ఖర్చు అభ్యర్థి లెక్కలోకే వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మీడియాలో వచ్చే ప్రతీ ప్రకటనను మానిటరింగ్ చేయాలన్నారు. అలాగే ఐసీసీలో నెలకొల్పిన కంట్రోల్ రూంను వారు సందర్శించారు. చెక్‌పోస్టుల వద్ద బృందాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడు పటాన్‌చెరుకు కేసీఆర్

పటాన్‌చెరు టౌన్: మాజీ సీఎం కేసీఆర్ బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే రోడ్‌షోలో కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ రాక సందర్భంగా ఇస్నాపూర్ చౌరస్తా నుంచి ముత్తంగి మీదుగా పటాన్‌చెరు వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత రోడ్ షోలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం



మాట్లాడుతున్న వీహెచ్ హన్మంతరావు

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనారిటీల సంక్షేమం సాధ్యమని మాజీ ఎంపీ, సీనియర్ నాయకుడు వీహెచ్ హన్మంతరావు అన్నారు. మంగళవారం పట్టణానికి విచ్చేసిన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇస్తున్న ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని బీజేపీ చెబుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజారిటీతో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను విస్మరించడం వల్లే ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. జహీరాబాద్ లోక్‌సభ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, నాయకులు ఖాజా ఫక్రుద్దీన్, జలాలుద్దీన్, ఆశప్ప, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు రైతు మృతి

వట్‌పల్లి(అందోల్): పిడుగుపాటుకు రైతు మృతి చెందిన సంఘటన అందోల్ పరిధిలోని ఎర్రారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు బోయిని పాపయ్య(52) మంగళవారం ఉదయం ఎడ్లను తోలుకొని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని 161 జాతీయ రహదారి పక్కనే పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మెడలో ఉన్న సెల్‌ఫోన్ పేలి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుని కుమారుడు పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్‌లో గుర్తింపు లేదు



ప్రభుగౌడ్‌ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న నిర్మల

సంగారెడ్డి: మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రభుగౌడ్‌తో పాటు మాజీ వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు భారతిరెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో తగిన గుర్తింపు లభించకపోవడంతోనే పార్టీ మారినట్లు వివరించారు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో పులిమామిడి రాజు, తుమ్మలపల్లి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

● అకాల వర్షం

అందోల్ మండలం కన్‌సాన్‌పల్లిలో తడిసిన ధాన్యం



జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలుల వర్షానికి అందోల్ మండలం కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయ్యింది. పటాన్‌చెరు నియోజకవర్గం బెల్ కాలనీలో చెట్లు విరిగి పడ్డాయి. జిన్నారం, హత్నూర మండలాల్లో వడగండ్లు పడ్డాయి. అందోల్ మండల ఎర్రారం గ్రామంలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందాడు.

పారదర్శకంగా పోలింగ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పోలింగ్ తేదీసమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం 'సాక్షి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ పలు విషయాలు వెల్లడించారు.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు
- తీవ్ర ఎండల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు
- మూడు జిల్లాల అధికార యంత్రాంగంతో సమన్వయం



'సాక్షి'తో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వల్లూరి క్రాంతి

SAKSHI INTERVIEW సాక్షి

☛ పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు పూర్తయ్యాయా? ఎన్నికల విధుల్లో ఎంతమందిని నియమించారు?

కలెక్టర్: పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుంటున్నాం. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సుమారు 13 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందితో పాటు కేంద్రాల వద్ద వివిధ రకాల విధులు నిర్వర్తించే వారందరికీ ఇప్పటికే రెండు పర్యాయాలు శిక్షణ అందించాం. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1,973 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ జరుగుతుంది.

☛ గత ఎన్నికల్లో ఈవీఎంలు మొరాయించాయి.. ఈసారి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈవీఎంల విషయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. అవసరాని కంటే అదనంగా 25 శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచాం. ఎండల తీవ్రతకు వీవీప్యాట్‌లు మొరాయించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో 40 శాతం అదనంగా అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే ఎక్కడైనా టెక్నికల్ సమస్యలు ఎదురైతే ఈసీఐఎల్ వంటి సంస్థల నిపుణులు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ముగ్గురు అందుబాటులో ఉంటారు. సెక్టోరల్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. చాలావరకు ఈవీఎంలు లేటెస్ట్ వెర్షన్‌కు సంబంధించినవే ఉన్నాయి.

☛ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎలా జరుగుతోంది?

కలెక్టర్: గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 4,656 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.

☛ హోంఓటింగ్ ఎంతవరకు వచ్చింది?

వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఇప్పటి వరకు సుమారు 230 మంది ఓటర్లు ఇంటినుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే అత్యవసర సేవల విధుల్లో ఉన్నవారు 19 మంది ఓటేశారు.

☛ ఓటింగ్ స్లిప్పుల పంపిణీ ఎలా జరుగుతోంది?

ఓటింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే 90 శాతం పూర్తయింది. బూత్‌లెవర్ అధికారులు తమ పరిధిలోని ఓటర్లందరికీ ఓటింగ్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. స్లిప్పులు ఇచ్చే సమయంలో ఓటర్ల కుటుంబంలోని ఒకరి సంతకం కూడా తీసుకోవాలని ఆదేశాలిచ్చాం. వలస కార్మికులందరికీ ఓటింగ్ స్లిప్పులు అందేలా చూస్తున్నాం.

☛ సీ-విజిల్ యాప్‌కు ఎన్నిఫిర్యాదులు వచ్చాయి? ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని పౌరులందరికీ వివరించాం. ఇప్పటి వరకు 44 ఫిర్యాదులు అందాయి. అందిన 15 నిమిషాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం సంబంధిత లొకేషన్‌కు వెళ్లి చర్యలు తీసుకుంటుంది. అర గంటలో అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.

☛ కోడ్ ఉల్లంఘన కేసుల పరిస్థితి ఏమిటి?

ఎన్నికల కోడ్ ఉల్లంఘించే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలపై పోలీసుశాఖ సమన్వయంతో కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే నమోదైన కేసుల దర్యాప్తును సమీక్షిస్తున్నాం. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారంలో నిబంధనల మేరకు నడుచుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

☛ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం విస్తరించి ఉన్న మూడు జిల్లాల అధికార యంత్రాంగంతో ఎలా సమన్వయం చేసుకుంటున్నారు?

సంగారెడ్డితో పాటు కామారెడ్డి జిల్లా అధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నాం. ఒక్క బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కొంతభాగం నిజామాబాద్ జిల్లాలో ఉంటుంది. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు, సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నాం. మొత్తంమీద ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ముందునుంచి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం.

> **ఎండలు మండుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?**
>
> ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు నీడ ఉండేలా షామియానాలు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. అన్ని కేంద్రాల వద్ద వైద్యారోగ్య సిబ్బంది బృందం అందుబాటులో ఉంటుంది. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

> **పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు?**
>
> గత లోక్‌సభ ఎన్నికల్లో 69 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి ఆ శాతాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాం. స్వీప్ క్యాలెండర్ ప్రకారం మహిళలు, యువత, కార్మికులు, రైతులు, ట్రాన్స్‌జెండర్లు, ఇలా అన్నివర్గాల వారికి ఓటు ఆవశ్యకత గురించి తెలిసేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాం. గ్రామ స్థాయిలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఎస్‌హెచ్‌జీ మహిళలకు రంగోళి, ముగ్గుల పోటీలు నిర్వహించాం. తక్కువ ఓటింగ్ శాతం నమోదయ్యే పట్టణ ప్రాంతాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హరికిషన్



మాట్లాడుతున్న హరికిషన్

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ హెచ్చరించారు. నారాయణఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.8.89 కోట్ల విలువైన అక్రమ మద్యం, కల్లు, నాటుసారా, గంజాయి, తదితర పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 1,557 కేసులు నమోదు చేసి 683 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మధ్య పటాన్‌చెరువులో రూ.9.23 కోట్ల విలువచేసే ఎంఎంసీ మత్తు పదార్థాన్ని సీజ్ చేశామన్నారు. జహీరాబాద్ పరిధిలో అయిదు, ఖేడ్ పరిధిలో నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఖేడ్ పట్టణంతోపాటు సర్కిల్ పరిధిలోని బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో స్థానిక ఎక్సైజ్ సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డా.నవీన్‌చందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కులం పేరుతో వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, మతం పేరుతో వస్తున్న బీజేపీ అభ్యర్థిని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర మండలం సిరిపుర, దేవునిగుట్ట తండా, ఎలిగేగుట్ట తండా, తెల్లరాళ్ల తండా, గోవిందరాజుపల్లి, చీక్ మద్దూర్, కొన్యాల, మాధుర, పన్యాల, బడంపేట, నవపేట, హత్నూర తదితర గ్రామాలలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. కులమతాలను రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నా బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. కోటి రూపాయలతో ట్రస్టు ఏర్పాటు చేస్తానంటున్న వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని సునీతారెడ్డి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ నర్సింలు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేష్ షెట్కార్



సురేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నారాయణఖేడ్: పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. పార్టీలో చేరిన వారిలో నాగల్‌గిద్ద మండలం కేశ్వార్ మాజీ సర్పంచ్‌లు నర్సింలు, జగ్గప్ప, ఖేడ్ మండలం చల్లగిద్ద తండా మాజీ ఉపసర్పంచ్ రాణానాయక్ వారి అనుచరులు మనూరు మండలం పుల్‌కుర్తి బీఆర్‌ఎస్ నాయకులు హస్తం గూటికి చేరారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ చాందీబాయి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్, పోతుల సంగారెడ్డి, మారుతీరావు, పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాహేర్‌అలీ, మాణిక్‌రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ శిక్షణపై త్రైపాక్షిక ఒప్పందం

ములుగు(గజ్వేల్): ఆన్‌లైన్‌లో ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అగ్రిటెక్ అంతర్జాతీయ శిక్షణకు మంగళవారం ఒప్పంద సంతకాలు చేసినట్లు ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ వీసీ డాక్టర్ బి.నీరజ తెలిపారు. ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, జస్ట్ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ గ్రూప్, ఏఈఈఎఫ్‌డబ్ల్యూఎస్ సంయుక్తంగా త్రైపాక్షిక సహకార ఒప్పందం కుదిరినట్లు వివరించారు. జస్ట్ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ గ్రూప్ వ్యవస్థాపకుడు సీఈఓ డాక్టర్.డీపీఎస్ బద్వాల్ ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారని చెప్పారు.

పార్ట్‌టైం ఉద్యోగమంటూ సైబర్ మోసం

రూ.1.85 లక్షలకు టోకరా

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ పేరిట వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.1.85 వేలు పోగొట్టుకున్నారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చిట్కుల్ నాగార్జున కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఈ నెల 2న పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. సదరు ఉద్యోగి వివరాలు నమోదు చేయగా.. సైట్ నిర్వాహకులు ఓ వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా రూ.2వేలు చెల్లించి వారు ఇచ్చిన టాస్క్‌లు ప్రారంభించాడు. మొత్తం రూ.1.85లక్షలు పెట్టగా.. వాటితో వచ్చిన కమీషన్‌ను సైతం సైట్ నిర్వాహకులు వాలెట్‌లో చూపుతూ వచ్చారు. ఉద్యోగి నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని కోరడంతో స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ పోలీసులకు, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

'కారు'.. జోరు

గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన కేసీఆర్ ప్రసంగం



కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

హవేళిఘణాపూర్(మెదక్): గులాబీ దళపతి బస్సు యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి మెదక్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వెల్‌కం బోర్డు నుంచి రాందాస్ చౌరస్తా వరకు దారి పొడవునా వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు నీరాజనం పలికారు. ర్యాలీగా వచ్చిన ఆయన రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించిన తీరు కార్యకర్తల్లో జోష్ నింపింది. గతంలో ఆయనకు మెదక్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ కోసం 15 ఏళ్ల పాటు అలుపెరుగని పోరాటం చేశానని.. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన తీరును ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంతంలోని హల్దివాగు, ఏడుపాయల వన దుర్గామాత, ప్రత్యేక మెదక్ జిల్లా ఏర్పాటుతో పాటు ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి పనులపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు నిశబ్దంగా విన్నారు. ఆయన ప్రసంగించిన 16 నిమిషాల్లో ఎనిమిది నిమిషాల పాటు మెదక్ జిల్లా గురించే మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టంకడితే మనం అనుకున్న అభివృద్ధి చేయొచ్చన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజలకు అభివాదం చేస్తున్న లోక్‌సభ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

కోళ్ల ఫారం గోడ కూలి..

ఇద్దరు కూలీల దుర్మరణం

కౌడిపల్లి(నర్సాపూర్): ఈదురు గాలులకు నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫారం గోడ కూలడంతో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన మండల పరిధిలోని రాయిలాపూర్(నాగ్సాన్‌పల్లి) శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. రాయిలాపూర్ శివారులోని జాతీయ రహదారి పక్కన శ్యామీర్‌పేట నర్సింగరావుకు చెందిన ఫాంహౌజ్, మామిడితోట ఉంది. తోటలో కొత్తగా కోళ్ల ఫారం షెడ్డు వేస్తున్నారు. కొంపల్లిలో నివాసం ఉండే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మేస్త్రీ తోట నాగమునీంద్ర షెడ్డు నిర్మాణానికి కాంట్రాక్టుకు తీసుకున్నాడు. అదే జిల్లాకు చెందిన నాగ గంగాధర్ రావు (35), చింతపల్లి సుబ్రమణ్యం(40) కొంపల్లి నుంచి షెడ్డు నిర్మాణానికి తీసుకువచ్చాడు. వారు ఇక్కడే ఉంటూ షెడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం గోడకు సిమెంట్ చేసేందుకు గోవ కట్టెలు కడుతుండగా ఒక్కసారిగా వచ్చిన ఈదురు గాలులకు గోడ కూలింది. సిమెంట్ ఇటుకలు వారిపై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. గమనించి కూలీలు కాంట్రాక్టర్‌కు, తోటయజమానికి చెప్పగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు నాగులుకు భార్య దేవి, ఇద్దరు పిల్లలు, సుబ్రమణ్యంకు భార్య శ్రీదేవి ఇద్దరు పిల్లలున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చింతపల్లి సుబ్రమణ్యం



నాగ గంగాధర్ రావు

పిడుగుపాటుకు పాడి రైతు మృతి



మల్లేశం (ఫైల్)

కొండపాక(గజ్వేల్): తెల్లవారు జామున పాలు పితికేందుకు వెళ్లిన రైతు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మల్లేశం(33) పాడిపశువులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పాలు పితికేందుకు బైక్‌పై వెళ్లాడు. వర్షం కురుస్తుండడంతో వేపచెట్టు కిందకు వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటుగా చెట్టుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన రైతులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లున్నారు.

గేదె మృతి



గేదె కళేబరం

కొమురవెల్లి(సిద్దిపేట): అకాల వర్షాలతో పిడుగు పడి ఓ గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని గురువన్నపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పుట్ట కనకయ్య తన పొలంలో సోమవారం రాత్రి గేదెలను కట్టివేశాడు. మంగళవారం తెల్లవారు జామున వెళ్లి చూడగా గేదె మృతి చెందింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



న్యాల్‌కల్(జహీరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని న్యామతాబాద్‌లో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన ప్రకారం.. న్యామతాబాద్ రైతులు మంగళవారం పొలం పనులకు వెళ్తున్న క్రమంలో కుర్ధంవాగు వద్ద గుంతలో గుర్తుతెలియని మృతదేహం కనపడగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతుడికి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని.. తెలుపు రంగు టీ షర్ట్‌పై న్యూలుక్ ఒరిజినల్ అని రాసిఉందని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాముకాటుకు మహిళ మృతి



అనసూయ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): పాము కాటుకు ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని గోవిందరాజుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన మోదుగుల అనసూయ(51) ఇంటి వద్ద బట్టలు ఉతుకుతుండగా కుడి చేతి వేలుకు పాము కాటేసింది. ఒక్కసారిగా రక్తం రావడంతో అనసూయ కేకలు వేసింది. కుటుంబీకులు ఇరుగుపొరుగు వారు వచ్చేసరికి పాము అక్కడి నుండి వెళ్లిపోయింది. ఆమెను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి భర్త నర్సింలు, ఇద్దరు కుమారులు సంతానం.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ కరు ణాకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సోహైల్ (24) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్లుగా ఓ యువతితో ప్రేమాయానం సాగించా రు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో ఆమె వేరే యువకుడితో నిశ్చితార్థం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన సోహైల్ సోసోమవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మహ్మద్ పాషా పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విషాదం నింపిన వేడుకలు

- పుట్టిన రోజు వేడుకలకు వెళ్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన
- ఒకరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



వెంకటేశం(ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): స్నేహితుని పుట్టిన రోజు వేడుకలు ఓ ఇంట్లో విషాదాన్ని నింపాయి. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన ప్రకారం.. సోమవారం గోవిందరాజుపల్లికి చెందిన సుమన్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన వెంట నవాబుపేట గ్రామానికి చెందిన దప్పు నర్సింలు కుమారుడు వెంకటేశ్(20), నర్సింలు ముగ్గురు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనం గ్రామ శివారులో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంత లోకాలకు

- టైర్‌పేలి డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

వట్‌పల్లి(అందోల్): ఆస్పత్రికి వెళ్తున్న వారు కారు టైరు పేలడంతో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సంగుపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన ప్రకారం.. పెద్ద శంకరంపేట నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి వెళ్తున్న కారు ఆంథోలు మండలం సంగుపేట శివారులో టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎర్ర సంగాగౌడ్(62) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య అంజమ్మ, కుమారుడు అరవింద్‌గౌడ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మంజుల, లావణ్య కాళ్లు విరిగిపోగా.. రవీందర్‌గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



చందా కుమారి(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన బీడీఎల్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బీహార్‌కు చెందిన మున్నాకుమార్ బతుకుదెరువు నిమిత్తం మండల పరిధిలోని పాటీ గ్రామానికి వలస వచ్చాడు. ఇటీవలే ఆయనకు శంషాబాద్‌లో ఉద్యోగం రావడంతో అక్కడే ఉంటూ అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి వెళ్లేవాడు. ఈ నెల 2న పిల్లలు రాజ్(2), సాచి(1)ను ఆసత్రికి తీసుకెళ్తున్నానని భర్తకు ఫోన్‌లో సమావచారం ఇచ్చి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు.. ఫోన్ కలవడం లేదు. దీంతో ఆయన ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి..



మన్నె లక్ష్మి (ఫైల్)

టేక్మాల్(మెదక్): భర్తతో గొడవపడిన మహిళ అదృశ్యమయింది. ఈ ఘటన మండల పరిధిలోని దనూరలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె లక్ష్మి అలియాస్ అంజమ్మ ఈ నెల 5న భర్త యాదయ్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పాత నేరస్తుడికి రిమాండ్

పోలీసుల పేరిట అక్రమ వసూళ్లు

మెదక్ మున్సిపాలిటీ: పోలీసు అవతారమెత్తి వ్యాపారుల వద్ద అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పట్టణ సీఐ దిలీప్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఇందిరాపూరీ కాలనీ చెందిన ఆముదా రఘు తండ్రి శ్రీనివాస్ ఎమ్మెల్యే తన వెనుకే ఉన్నాడంటూ.. పోలీసుల పేరు చెబుతూ వ్యాపారస్తులను,వాహనదారులను బెదిరిస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన తమ్ముడితో దగ్గర సంబంధాలు ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడ్డున్నాడు. ఉన్నతాధికారుల నెంబర్స్ సేకరించి ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేసి వారి పేర్లు చెబుతూ డబ్బులు దోపిడీ చేస్తున్నాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వారిపై ఆజమాయిషీ చలాయించే వాడని చెప్పారు. నిందితుడిపై గతంలో నగరంలోని అఫ్జల్‌గంజ్ ఠాణా పరిధిలో రేప్ కేసు, హవేలి ఘనాపూర్ పీఎస్ పరధిలో దోపిడీ కేసు, మెదక్ టౌన్ పీఎస్‌లో ఏడు కేసులున్నట్లు వివరించారు. జిల్లా కోర్టు శిక్షలు విధించినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పొలిటికల్ హీట్

ఖేడ్ అభివృద్ధికి జోడెద్దుల్లా పనిచేస్తాం



కార్యకర్తల్లో జోష్ నింపుతున్న అభ్యర్థి సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలో మంగళవారం ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపుకోసం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అభ్యర్థి సురేష్ షెట్కార్ కామారెడ్డిలో ప్రచారం కోసం బయలుదేరారు. ప్రచారం నిర్వహిస్తున్న ప్రాంతం మీదుగా వెళుతూ ఆగి తనను ఎంపీగా గెలిపిస్తే ఎమ్మెల్యే, తాను ఐక్యంగా జోడెద్దుల్లా పనిచేస్తూ ఖేడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేస్తామన్నారు. ఇరువురం కలవడం అభివృద్ధికి సంకేతమన్నారు, దీంతో కార్యకర్తల్లో ఉత్సాహం నిండింది. కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఖేడ్ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన టికెట్‌ను త్యాగం చేసిన షెట్కార్ గెలుపుకోసం శక్తివంచనలేకుండా కృషిచేస్తామని ఎమ్మెల్యే మరింత ఉత్సాహపర్చారు.

పేదింటి బిడ్డను పార్లమెంట్‌కు పంపించండి

కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి మధు ముదిరాజ్



ములుగు రోడ్‌షోలో మాట్లాడుతున్న నీలం మధు

ములుగు(గజ్వేల్): లోక్‌సభ ఎన్నికల్లో పేదింటి బిడ్డకు అవకాశం కాంగ్రెస్‌కు ఓటేసి తనను పార్లమెంట్‌కు పంపాలని పార్టీ మెదక్ అభ్యర్థి నీలం మధు కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంతో పాటు మామిడ్యాల, బహిలంపూర్, తానెదార్‌పల్లి, తండాలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. మహానేతలు ప్రాతినిధ్యం వహించిన మెదక్ లోక్‌సభ స్థానం నుంచి తనకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్‌కు రుణపడి ఉంటానన్నారు. ఇక్కడ నుంచి ఎంపీ గెలిచిన ఇందిరా గాంధీ పరిశ్రమలను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే.. గత పాలకులు డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేశారన్నారు. బీసీ కుల గణన చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తనను ఆశీర్వదిస్తే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాగా వంటిమామిడి నుంచి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో డప్పుచప్పుల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాసగుప్తా, దేవేందర్‌రెడ్డి, గణేశ్‌యాదవ్, కృష్ణారెడ్డి, పోచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీయే మరోసారి ప్రధాని

- కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియదు
- బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై



ప్రజలకు అభివాదం చేస్తున్న రఘునందన్‌రావు, అన్నామలై

సంగారెడ్డి: దేశ వ్యాప్తంగా యాభై శాతం ఓటింగ్ పూర్తయినప్పటికీ ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి ఎవరనేది తెలియని దుస్థితి ఉందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ.. సుస్థిర పాలనకోసం మరోసారి మోదీని ప్రధానిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి పార్టీలన్నీ అవినీతికి పాల్పడిన పార్టీలేనని విమర్శించారు. పదేళ్లలో దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దామన్నారు. గ్యారంటీలను అమలు చేయని అసమర్థ కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశ్‌పాండే కారు దిగి అన్నామలై సమక్షంలో కమలం కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జగన్, వాసు, నాగరాజు, రవి, డాక్టర్ రాజుగౌడ్, రమేశ్, రాములు, విష్ణువర్ధన్ రెడ్డి, విజయ్, నరేన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

- బీఆర్‌ఎస్, బీజేపీల మాటలు నమ్మొద్దు
- దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేస్తాం
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



దుబ్బాకలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

దుబ్బాక: ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్సేనని, బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మొద్దని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ప్రచారం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో జగ్గారెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని, ప్రజలను మోసం చేసింది బీఆర్‌ఎస్ అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్‌రావు ఇక్కడికి రైలు తెచ్చిండా అన్నారు. నీలం మధును గెలిపిస్తే చెరుకు శ్రీనన్నను తీసుకొని సీఎం దగ్గరికి వెళ్లి, దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను చేయించే బాధ్యత తీసుకుంటానన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాకను అభివృద్ధి చేసిన ఘనత చెరుకు ముత్యంరెడ్డిదే అన్నారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం దివాలా..

కేసీఆర్ తెలంగాణను దోచుకొని.. పూర్తిగా దివాలా తీయించారని జగ్గారెడ్డి మండిపడ్డారు. రైతులకిచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15లోపు సీఎం రేవంత్‌రెడ్డి చేసి తీరుతారన్నారు. కేసీఆర్ చేసిన పాపం ఊరికే పోదని, వడ్డీతో సహా కక్కాల్సిందేనన్నారు. బీడీ కట్టలపై పుర్రె గుర్తు తెచ్చి కార్మికుల కడుపులు కొట్టిన బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు.

ఓటర్లను ప్రలోభపెడితే కేసులు

- ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలి
- పోలీసు అధికారుల సమీక్షలో సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఎన్నికల సందర్భంగా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నిస్తే వారిపై ఎంసీసీ వాయిలేషన్ కేసులు నమోదు చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర బలగాలకు సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాకలో అన్ని వసతులు కల్పించాలన్నారు. వారికి జిల్లా పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్‌లు, వాహనాల తనిఖీ విస్తృతంగా నిర్వహించాలన్నారు. అవసరానికి తగినన్ని వాహనాలు ఎంగేజ్ చేసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో, పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. సరిహద్దు జిల్లాల పోలీసులతో సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీశ్, రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుండా విక్రయాలు

రూ.1.30లక్షల విలువైన సిగరెట్ల స్వాధీనం

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ పన్ను తప్పించుకునేందుకు గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న సిగరెట్ బాక్స్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్, వన్, టూ టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. వారు తెలిపిన ప్రకారం.. పట్టణంలో కొందరు వ్యాపారస్తులు ట్యాక్స్ చెల్లించకుండా ఉండేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన సిగరెట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి, సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ క్రాస్‌రోడ్డులో సురేష్‌కుమార్ నిర్వహిస్తున్న లక్ష్మీ కిరాణం దుకాణంలో, శ్రీనివాసనగర్‌లో గూడ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కిరాణం, సుభాష్‌రోడ్డులోని హరిహర స్టోర్‌లో మంగళవారం పోలీసులు తనిఖీ చేయగా రూ.1.30లక్షల విలువైన సిగరెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై సంబంధిత వన్ టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్‌లలో వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.